ప్రాణప్రదాతలు

- రక్తదానంతో మరొకరికి ప్రాణదానం
- అవగాహన కల్పించడంలో ఎన్జీఓల కృషి
- ఆసక్తి చూపుతున్న యువత
- అత్యవసర సమయంలో ఆదుకుంటున్న దాతలు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

టేకుమట్ల: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఇదివరకు ఎన్నో సందర్భాల్లో నిరూపితమైంది. ప్రమాద సమయంలో, అత్యవసర సమయాల్లో రక్తం సకాలంలో అందక ఎంతో మంది ప్రాణాలను కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఈనేపథ్యంలో రక్తదాతలను ప్రోత్సహిస్తూ ఎన్జీఓలు రక్తాన్ని సేకరించి భద్రపరుస్తూ బాధితులకు అందిస్తున్నారు. ఈక్రమంలో నేడు(జూన్–14) ప్రపంచ రక్తదాతల దినోత్సవంగా ప్రత్యేక కథనం.

అపోహలు సరికాదు..

రక్తదానం చేయడం వల్ల నీరసించి ఆరోగ్యం క్షీణిస్తుందని పలువురు ఆందోళన చెందుతారు. కానీ, రక్తదానం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవు. కేవలం 21 రోజుల్లోనే పూర్తి స్థాయిలో రక్తం శరీరంలో సమకూరుతుంది. 6నుంచి 12 వారాల్లో పురుషులకు, 6నుంచి 16 వారాల్లో మహిళలకు హిమోగ్లోబిన్ స్థాయిలు సమం అవుతాయి. ఇదిల ఉండగా.. 18 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలలోపు ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరు రక్తదానం చేయవచ్చు. హెపటైటిస్ బీ, హెచ్ఐవీ, రక్తహీనత, బలహీనత, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు రక్తదానం చేసేందుకు అనర్హులుగా వైద్యులు చెబుతారు.


భూపాలపల్లిలో రక్తదానం చేస్తున్న యువకులు(ఫైల్)

69సార్లు రక్తదానం చేశాను..



నేను ఇప్పటివరకు 69సార్లు రక్తదానం చేశాను. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. అపోహలపై అవగాహన కల్పించి, 20శిబిరాలను ఏర్పాటు చేసి వందల మంది దాతలచే రక్తదానం చేయించాను. 2015లో గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాను. రక్తదానంపై అపోహలు వీడి.. యువత ముందుకురావాలి.

\- కామిడి సతీష్‌రెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, జడలోపేట

12సార్లు రక్తదానం చేశాను



విద్యార్థి దశ నుంచే రక్తదానం చేస్తున్నాను. ఇప్పటి వరకు 12సార్లు రక్తదానం చేశాను. ఆపద సమయంలో ఎవరో ఒకరికి ప్రత్యక్షంగా లేదా.. పరోక్షంగా ప్రాణదానం చేస్తున్నామంటే ఎంతో తృప్తిగా ఉంటుంది. రక్తదానం చేసిన ప్రతీసారి ఎంతో సంతృప్తిగా ఉంటుంది.

\- అదగాని సాంబశివుడు, పంచాయతీ కార్యదర్శి, రామకిష్టాపూర్(వి)

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు..



ప్రతీ సంవత్సరం అక్టోబర్‌లో నిర్వహించే పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా రక్తదానం చేస్తున్నాను. గ్రామాల్లోని యువతకు రక్తదానంపై అవగాహన కల్పించి ఎంతో మందిచే రక్తదానాన్ని చేయించాను. రక్తదానంపై అనేకమందికి అపోహలు నివృత్తి చేస్తున్నాను. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం వల్ల విలువైన ప్రాణాలను కాపాడొచ్చు.

\- ప్రసాద్, ఎస్సై, టేకుమట్ల

అపోహలు వీడాలి



రక్తదానం చేయడం వల్ల నీరసించిపోతామనేది ఓ అపోహ మాత్రమే. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. మానవునిదేహంలోని ఎర్ర కర్తకణాలు ప్రతీ మూడు నెలలకోసారి చనిపోతూ మళ్లీ కొత్తగా ఉత్పత్తి అవుతాయి. కావున కర్తదానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. రక్తదానంతో ఆపదలో ఉన్న వారిని ఆదుకునే గొప్ప అవకాశం కలుగుతుంది.

\- డాక్టర్ ఆశాజ్యోతి, పీహెచ్‌సీ, వెలిశాల

మోడల్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

టేకుమట్ల: మండలంలోని అన్ని గ్రామాల విద్యార్థులు మోడల్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు అన్నారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హైమావతి ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని ఆశిరెడ్డిపల్లి, వెలిశాల, దుబ్యాలలో మోడల్ స్కూల్ విద్యపై విద్యార్థులకు వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరు నుంచి ఇంటర్ వరకు మోడల్ స్కూల్‌లో ఆంగ్ల మాధ్యమంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాభోదన కలదని అన్నారు. డిజిటల్ క్లాస్‌లతో పాటు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, పౌష్టికాహార మధ్యాహ్న భోజనం అందిస్తామన్నారు. బాలికలకు తొమ్మిది తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచిత హాస్టల్ వసతి కలదని, పరకాల–దుబ్యాల వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా ఉందని తెలిపారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో నేరుగా మోడల్ స్కూల్‌లో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 95732 07645కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొమురెల్లి, రాజు, మహేష్ ఉన్నారు.

ఉడుములకు భలే గిరాకీ

- కేజీకి రూ.800 పలుకుతున్న ధర



మహాముత్తారం: మండలంలోని అటవీ గ్రామాలైన కనుకునూర్, రెడ్డిపల్లి, సింగంపల్లి, రేగులగూడెం, సింగారం, బోర్లగూడెం తదితర గ్రామాల్లోని గిరిజనులు ముమ్మరంగా ఉడుములను పడుతున్నారు. కాగా, ప్రస్తుతం ఉడుములను భలే గిరాకీ ఉంది. ఉడుము కూర నడుము నొప్పికి, కీళ్ల నొప్పుల లాంటి వ్యాధులకు బాగా పని చేస్తుందని ప్రజల నమ్మకం. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని సింగరేణి కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు కొంత మంది కేజీకి రూ.800 కొనుగోలు చేస్తున్నట్లు ఉడుములు సేకరించే గిరిజనులు చెబుతున్నారు. గతంలో కేజీని రూ.350 ఉన్నప్పటికి ఇప్పుడు రూ.800కు పెరిగిందని పలువురు ముందుగానే డబ్బులు చెల్లించి మరుసటి రోజు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు వారు తెలిపారు. ఉడుముల శికారుకు వెళ్లి కొంత మంది గిరిజనులు ప్రమాదాల బారినపడ్డ సంఘటన కూడా ఉన్నాయి. అయినప్పటికీ కొంత మంది గిరిజనులు మాత్రం నెలరోజుల వ్యాపారంగా ప్రతీ సంవత్సరం ఉడుములను సేకరించి పట్టణ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మొగుళ్లపల్లి: మండలంలోని కోర్కిశాల మోడల్‌స్కూల్‌లో ఆరోవ తరగతి నుంచి ఇంటర్ వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆఫ్‌లైన్ (ప్రత్యక్ష) దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హైమావతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా ఇంటర్ విద్యార్థులకు హాస్టల్ వసతితో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందించబడతాయని, దూరప్రాంత విద్యార్థులకు అన్ని రూట్ల నుంచి ఉచిత బస్సు సౌకర్యం కలదన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి



చిట్యాల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బడిబాట కార్యక్రమం గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదగటానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో తోడ్పడుతాయని అన్నారు. రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల వరకు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అక్షరభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కట్కూరి పద్మనరేందర్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, భాగ్యలక్ష్మీ, అరుణ, సుజాత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల గోదాం ప్రారంభం

ములుగు రూరల్: మండల పరిధిలోని ఇంచెర్ల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గోదాం, కార్యాలయాన్ని మంత్రి సీతక్క గురువారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్‌జీ, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, డీసీఓ సర్దార్ సింగ్, రైతులతో పాటు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన

ములుగు: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ పనులను మంత్రి సీతక్క గురువారం పరిశీలించారు. మోడల్ బస్టాండ్‌గా పునర్‌నిర్మించాలనే విషయమై కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీతో కలిసి ఆర్టీసీ అధికారులతో చర్చించారు. బస్టాండ్ పరిసరాల్లోని ప్రభుత్వ భూమి వివరాలను అందించాలని ఆదేశించారు. పూర్తి నివేదిక వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామన్నారు.

తునికాకు పెండింగ్ బోనస్ చెల్లించాలి



వెంకటాపురం(కె): పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ డబ్బులను తక్షణమే చెల్లించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన తునికాకు కార్మికులు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అటవీ శాఖ కార్యాయలం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా తుమ్మల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. 2016 నుంచి తునికాకు కార్మికులకు చెల్లించాల్సిన బోనస్ సొమ్ములను చెల్లించడంలో స్థానిక అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తునికాకు బోనస్ డబ్బుల చెల్లింపుపై జిల్లా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు హామీ ఇవ్వటంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పుల రఘుపతి, వంకా రాములు, గ్యానం వాసు, కుమ్మరి శ్రీను, దామోదర్, కట్ల నర్సింహాచారి తదితరులు ఉన్నారు.

చెత్తాచెదారం తొలగింపుపై ప్రత్యేక దృష్టి



ఏటూరునాగారం: చెత్తాచెదారం తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఏటూరునాగారం పంచాయతీ కార్యదర్శి రమాదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మురుగు కాలువల్లో చెత్తాచెదారం తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పనులను ఆమె పరిశీలించి తగు సూచనలు చేశారు. కాల్వల్లో చెత్తాచెదారం పడేయకుండా ఉండాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులను చెత్తా కుండీల్లో వేయాలన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మల్హర్: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని వల్లెకుంట జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శనం అన్నారు. మండలంలోని వల్లెకుంట గ్రామంలో ఉపాధ్యాయులు గురువారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శనం మాట్లాడుతూ.. విద్యతోనే సామాజిక మార్పు వస్తుందని, ఉపాధి దొరుకుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యాక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, మెహరాజ్, ఆనంద్, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలి


మాట్లాడుతున్న ముంజాల భిక్షపతి

వెంకటాపురం(కె): ఆదివాసీల సాగులో ఉన్న భూములకు రక్షణ కల్పించాలని ప్రజాసంఘాల జెఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొమరంభీమ్ కాలనీ ఆదివాసీల భూమలకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతూ గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగవ రోజు భిక్షపతి దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశ విధానాలు అమలు చేస్తున్నాయని అన్నారు. ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం సాయి, ప్రతాప్, సూర్యం, నూనె శ్రీనివాస్, నర్సింహరావు, రాజేష్, మనోజ్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే


ఆశిరెడ్డిపల్లిలో సర్వే చేస్తున్న ప్రవీణ్‌కుమార్

టేకుమట్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ ఇంటింటి సర్వే కొనసాగుతోంది. గురువారం అధికారులు ఇంటింటికీ వెళ్లి మిషన్ భగీరథ నీటి కుళాయి ఉందా.. వినియోగంలో ఉందా.. లేదా.. అనే విషయాలను నమోదు చేశారు. అలాగే రికార్డుల్లో పేరు లేకుంటే నమోదు చేసుకుంటూ, మృతి చెందిన వారి వివరాలను సైతం నమోదు చేసుకుంటున్నారు. ఈ సర్వేలో మిషన్ భగీరథ నీళ్లు ఎంత మందికి అందుతున్నాయి, ఎంత మంది మృతి చెందారనే విషయాలను తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న గండ్ర వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాల్గురి నరేందర్, బల్గురి రామారావు, ఆకుతోట సుధాకర్, కదారి ఐలయ్య, ఇంజపెల్లి శ్రీనివాస్ ఇటీవల మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆకుతోట సుధాకర్, ఇంజపెల్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు కత్తి రాజు, బొచ్చు శ్రీనివాస్, జన్నే రాజు, కత్తి ప్రభాకర్, ఆకుతోట సంపత్, రమేష్, రాజేశ్వర్‌రావు, రవీందర్‌రావు, లక్ష్మణ్‌రావు, స్వామి తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


రేగొండ: కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోని ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తుందన్నారు. గత పాలకుల హయాంలో నిరుపేదలు నిరుపేదలుగానే మిగిలారని ఆరోపించారు. కానీ ప్రస్తుతం ప్రజా పాలనలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

బాధితురాలికి భరోసా...

మండలంలోని ఎంపేడు గ్రామానికి చెందిన ముత్యాల భాగ్యమ్మ కిడ్నీలో రాళ్లు వచ్చాయని ఆపరేషన్ చేయగా ఫెయిల్ అయి ప్రస్తుతం నడవలేని స్థితికి చేరుకుంది. దీంతో చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేను కలిసి పరిస్థితిని వివరించగా సానుకూలంగా స్పందించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే టేకుమట్ల–రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగులో పునఃనిర్మాణంలో ఉన్న వంతెనను పరిశీలించి, వానాకాలంలో రవాణాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. తహసీల్దార్ విజయలక్ష్మీ, ఆర్ఐ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి, సంపత్‌రావు, వెంకటరాజిరెడ్డి, తోట గట్టయ్య, అప్పం కిషన్, వీరేశం పాల్గొన్నారు.

చిట్యాలలో..

మండలంలోని పలు గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముభారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మండల కేంద్రంలో చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎంపీపీ దావు వినోదావీరారెడ్డి, జెడ్పీటీసీ గొర్రె సాగర్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

రేగొండ: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కొత్తపల్లిగోరి, రేగొండ మండలాలకు చెందిన 49 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు సత్యనారాయణ స్వామి, వీరభద్రం, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ పున్నం లక్ష్మీ, ఎంపీటీసీలు ఐలి శ్రీధర్, ఎర్రబెల్లి రవీందర్ రావు, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ నిర్మాణానికి కృషి చేస్తా..


టేకుమట్ల: పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌కు 20 కుర్చీలను మడతపల్లి ఎంపీటీసీ సూర స్వాతి భర్త సుధాకర్ ప్రదానం చేయగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పట్టెం కోటిలింగంకు అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనా ప్రెస్ క్లబ్ కమిటీని ఎమ్మెల్యే శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షుడు కమలాకర్, సంయుక్త కార్యదర్శి రవీందర్, గౌరవ అధ్యక్షులు నామాల రమేష్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీటీసీలు రవీందర్ రావు, శ్రీధర్, జిల్లా నాయకులు నాయిని సంపత్‌రావు, ఉమేష్‌గౌడ్, బాబురావు, భిక్షపతి పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట, లక్ష్మీనరసింహ స్వామి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 18, 19, 20న దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మరాఠీ కాంతారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో కొమురయ్య భవన్‌లో శిక్షణ తరగతుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు రాసపల్లి భద్రయ్య, పీక రవికాంత్, నేరెళ్ల జోసఫ్ సంధ్య, చిట్యాల పద్మ, చల్లూరి రక్షిత, రేవెల్లి రాధిక, ఆముదాపురం వైష్ణవి, చల్లూరి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న కూలీ మృతి

చిట్యాల: మండల కేంద్రంలోని వెంకట్‌రావుపల్లికి చెందిన గోల్కొండ సరోజన (57) ఉపాధిహామీ పనికి వెళ్లి అస్వస్థతకు గురై, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్రావుపల్లి(సి) గ్రామానికి చెందిన గోల్కొండ సరోజన, భర్త సారయ్య ఈ నెల 5న వెంకట్రావుపల్లి శివారులోని పెద్ద చెరువులో ఉపాధిహామీ పనికి వెళ్లారు. ఈక్రమంలో సరోజన వడదెబ్బ సోకి అస్వస్థతకు గురి కావడంతో భర్త సారయ్యతోపాటు తోటి కూలీలు హుటాహుటిన స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లి మరింత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. వైద్యానికి సుమారు రూ.6 లక్షల ఖర్చు అయిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఆలయాన్ని ఢీకొట్టిన లారీ


ధ్వంసమైన మైసమ్మ ఆలయం

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి–పరకాల జాతీయ రహదారిపై మంజూర్‌నగర్ సమీపంలో రోడ్డుపై ఉన్న రోడ్డు మైసమ్మ ఆలయాన్ని బుధవారం అర్ధరాత్రి బొగ్గులారీ ఢీ కొట్టింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాపల్లి నుంచి పరకాల వైపు వెళ్తున్న బొగ్గు లారీ అతివేగంగా వెళ్లి మైసమ్మ దేవాలయాన్ని ఢీకొంది. దీంతో దేవాలయం వెనకభాగం పూర్తిగా కూలిపోగా.. పైన రేకులు కూడా చిందరవందర అయ్యాయి. అలాగే లారీ డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. కాగా మళ్లీ వెంటనే ఆలయం పునరుద్ధరణ పనులను గురువారం ఉదయం ప్రారంభించారు.

సాగు పనుల్లో రైతన్న నిమగ్నం

మహాముత్తారం: వానాకాలం పంట సాగుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలోని కనుకునూర్, మహాముత్తారం, వజినేపల్లి, పోలారం, కొర్లకుంట, మాదారం, గండికామారం, నిమ్మగూడెం తదితర గ్రామాల్లో గురువారం రైతులు పత్తి సాగుకోసం దుక్కులు దున్నడం, అచ్చు కొట్టడం, పత్తికట్టె కాలబెట్టడం తదితర పనుల్లో రైతులు బిజీ బిజీగా గడిపారు.


దుక్కి దున్నుతున్న రైతులు


అచ్చు కొడుతున్న రైతు